# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 21-07-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ప్రపంచ వారసత్వ కమిటీ 46వ సమావేశాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు సాయంత్రం ప్రారంభిస్తారు .**

**2. ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి.**

**3. వర్షాల ప్రభావంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాల పట్ల చర్యలు చేపట్టాలని రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి రవికుమార్ అధికారులను ఆదేశించారు.**

**3. వరద బాధితులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు.**

**4. రేపటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ రోజు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది.**

==========================

ప్రపంచ వారసత్వ కమిటీ 46వ సమావేశాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ప్రారంభించనున్నారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే ఈ సమావేశంలో దేశ వారసత్వ పరిరక్షణ గురించి ప్రధానమంత్రి ప్రసంగిస్తారు. ఈ నెల 31 వరకు జరగనున్న ప్రపంచ వారసత్వ కమిటీ సమావేశానికి భారత్ తొలిసారిగా ఆతిథ్యం ఇస్తోంది. సంవత్సరానికి ఒకసారి ఈ కమిటీ సమావేశమవుతుంది. ఈ సమావేశంలో సహజ, సాంస్కృతిక వారసత్వ సంపద పరిరక్షణపై ప్రపంచ దేశాల సహకారంపై చర్చించనున్నారు.

--------------------------

రాష్ట్ర శాసనసభ సమావేశాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. రేపు ఉదయం 10 గంటలకు గవర్నర్ ప్రసంగంతో ఉభయసభల సమావేశాలు మొదలుకానున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి అవసరమైన బడ్జెట్ తో పాటు పూర్తిస్థాయి బడ్జెట్ ను రాష్ట్ర ప్రభుత్వం ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టనుంది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో వారం రోజుల పాటు రాష్ట్ర ఉభయ సభల సమావేశాలు ఏర్పాటు చేసి పూర్తిస్థాయి బడ్జెట్ కు ప్రభుత్వం ఆమోదం తెలపనుంది.

--------------------------

వర్షాల ప్రభావంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర

విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ పునరుద్ధరణ చర్యలపై ఆ శాఖ సిబ్బందితో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పనిచేయని విద్యుత్ తీగలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను త్వరితగతిన మరమ్మత్తు చేయడానికి సరిపడా సిబ్బందిని, పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. విద్యుత్ అంతరాయాలపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు, సమస్యలు నమోదు చేసుకునేందుకు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో ఐదు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలపై 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు లేదా కంట్రోల్ రూం నంబర్లకు ఫోన్ చేయొచ్చని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఏక్ పేడ్ మా కే నామ్- అమ్మ కోసం ఒక చెట్టు కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు భావితరాలకు కాలుష్య రహిత వాతావరణాన్ని అందించవచ్చని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు వై.దొరబాబు తెలిపారు. జిల్లాలోని అల్లవరంలో తల్లిపేరుతో మొక్కను నాటే కార్యక్రమంలో పాల్గొని మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిజెపి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టిన అమ్మ కోసం ఒక చెట్టు కార్యక్రమాన్ని జిల్లాలో అన్ని గ్రామాల్లోనూ చేపడుతున్నామన్నారు. ప్రధానమంత్రి పిలుపుతో ఇప్పటికే అనేక గ్రామాల్లో స్వచ్ఛందంగా గ్రామస్తులు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారని తెలిపారు.

---------------------------

వరద బాధితులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఏలూరు జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని వరద ముంపు గ్రామాలలో మంత్రి అధికారులతో కలిసి పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరదల కారణంగా ఇళ్ళు కోల్పోయిన వారికి నష్టపరిహారం అందించడం జరుగుతుందన్నారు. ముంపు తగ్గిన తర్వాత ప్రభావిత గ్రామాలలో నష్టాన్ని అంచనా వేస్తామని చెప్పారు. వరద నీరు పూర్తిగా తగ్గేవరకూ బాధితులకు సహాయ కేంద్రాలలో భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. బాధిత కుటుంబాలకు బియ్యం, కందిపప్పు, వంటనూనె వంటి నిత్యావసర సరుకులను అందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ రోజు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. పార్లమెంట్ ఉభయ సభలు సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీల సహకారాన్ని ప్రభుత్వం ఈ సందర్భంగా కోరనుంది. రేపటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానుండగా ఎల్లుండి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్ సభలో 2024 - 25 కేంద్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టనున్నారు. కాగా పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఆరు కొత్త బిల్లులను ప్రవేశపెట్టనుందని లోక్ సభ సచివాలయం తెలిపింది.

---------------------------

బీసీ సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు అన్ని సదుపాయాలను కల్పించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత అధికారులను ఆదేశించారు. వర్షాల కారణంగా విద్యార్థులకు వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. హాస్టళ్లలో వసతులపై ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. సౌకర్యాల కల్పన విషయంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలిగినా బాధ్యులైన వారిపై కఠిన చర్యలు ఉంటాయని మంత్రి

హెచ్చరించారు. పరిశుభ్రమైన వాతావరణం కల్పించినపుడే విద్యార్థుల మరింత మెరుగ్గా చదువుకునే అవకాశం ఉంటుందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

---------------------------

పర్యావరణాన్ని పరిరక్షణకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు అమ్మ కోసం ఒక చెట్టు, ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమాన్ని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో విస్తృతంగా అమలు చేస్తున్నామని జిల్లా అటవీశాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. జిల్లాలోని అటవీ ప్రాంతంలో ఉన్న ఖాళీ ప్రదేశాల్లో 20 వేల మొక్కలను నాటామన్నారు. మొక్కలను అటవీ శాఖ ఉచితంగా అందజేస్తుందని, ప్రతి ఒక్కరూ తల్లి పేరుతో ఒక మొక్కను నాటి సంరక్షించాలని కోరారు. చెట్లను నాటడం ద్వారా భూతాపాన్ని తగ్గించవచ్చని తెలిపారు.

---------------------------

గోదావరి డెల్టాలోని కాలువలను శాశ్వత ప్రాతిపదికన ఆధునీకరించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని బిజెపి అనపర్తి శాసనసభ్యులు ఎన్ రామకృష్ణారెడ్డి తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలో నిన్న ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం కాలువల్లో ఏర్పడిన పూడికలు తొలగించకపోవడంతో రైతులు పంట పొలాలు, లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురవుతున్నాయన్నారు. గోదావరి డెల్టాలోని కాలువల్లో పూడికలు తొలగించడానికి 25 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. సముద్రానికి వచ్చే పోటు కారణంగా కాలువలను నీరు సముద్రంలోకి వెళ్లకపోవడంతో ఇబ్బందులు వస్తున్నాయని, ఇటువంటి సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

---------------------------

వ్యాస మహర్షి జయంతిని పురస్కరించుకుని ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా గురుపౌర్ణమి పర్వదినాన్ని జరుపుకుంటున్నారు. ఆషాఢ శుద్ధ పౌర్ణమి సందర్భంగా తూర్పుగోదావరి జిల్లాలో సాయిబాబా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. రాజమహేంద్రవరం, రాజానగరం, కొవ్వూరు, గోపాలపురం, నిడవోలు, అనపర్తి నియోజకవర్గంలో బాబా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుపూర్ణిమ సందర్భంగా గోదావరీ నదిలో పుణ్య స్నానాలు ఆచరించే కొవ్వూరు పుష్కర్ ఘాట్లను జిల్లాకలెక్టర్ పి. ప్రశాంతి పరిశీలించారు. గోదావరిలో వరద ప్రవాహం ఉన్నందున నదీ స్నానాలకి వెళ్లకుండా, జల్లు స్నానాలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలోని సాయినాథుని ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. సాయిబాబాకు గురుపాదుక పూజ నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ సందర్భంగా భజనలు, కోలాటాలతో ప్రత్యేక భజన కార్యక్రమాలను నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా సాయి బాబా మందిరాల్లో గురు పౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. విజయవాడ ముత్యాలంపాడు లోని శ్రీ షిరిడి సాయి మందిరంలో జరిగిన వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా తెల్లవారుజాము నుండి స్వామివారికి విశేష అభిషేకాలు ,ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

---------------------------

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేశ్ తెలిపారు. అనకాపల్లిలో ఆయన మాట్లాడుతూ,

యువతకు ఉపాధి కల్పనలో భాగంగా మాడుగుల, చోడవరం ప్రాంతాల్లో అయిదువేల ఎకరాల్లో ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటుకు భూ సేకరణ చేయాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీచేసిందని వివరించారు. ప్రభుత్వ భూమితో పాటు ప్రైవేటు భూములను సేకరించి కాలుష్య రహిత పరిశ్రమలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎంపీ నిధులతో పార్లమెంట్ పరిధిలోని 1000 నుంచి 1500 గ్రామాలకు పరిశుభ్రమైన తాగునీటిని అందించేలా నీటి శుద్దీకరణ ప్లాంట్లను నెలకొల్పనున్నట్లు తెలిపారు.

---------------------------

నీట్ అండర్ గ్రాడ్యుయేట్ వైద్య కోర్సుల ప్రవేశ పరీక్ష ఫలితాలను జాతీయ పరీక్ష నిర్వహణ సంస్థ– ఎన్ టి ఏ నగరాల వారీగా, కేంద్రాల వారీగా ప్రకటించింది. అభ్యర్థుల పేర్లు లేకుండా నగరాల, కేంద్రాల వారీగా నీట్ ఫలితాలు వెబ్సైట్లో పొందుపరచాలని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జాతీయ పరీక్ష నిర్వహణ సంస్థ ఈ ఫలితాలను వెల్లడించింది. నీట్ ఫలితాలను నీట్ డాట్ ఎన్ టి ఏ ఆన్లైన్ డాట్ ఇన్, వెబ్ సైట్ లో ఫలితాలు చూడవచ్చని తెలిపింది

=====================